మార్కెట్ యార్డులో స్థల సమస్య

- చల్‌గల్ మార్కెట్ యార్డులో కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- మార్కెట్‌కు వస్తున్న యాసంగి సీజన్ ఉత్పత్తులు



చల్‌గల్ మార్కెట్ యార్డులో కొనసాగుతున్న ప్లాట్‌ఫాం పనులు



మొక్కజొన్న, పసుపుతో నిండిపోయిన జగిత్యాల మార్కెట్‌యార్డు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో స్థల సమస్య ఎదురవుతోంది. రైతులు తీసుకవచ్చే కొద్దిపాటి ధాన్యానికే మార్కెట్ అంతా నిండిపోతోంది. దీంతో మార్కెట్ యార్డులో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రస్తుతం పసుపు, మొక్కజొన్న పంట ఉత్పత్తులు వస్తుండటంతో యార్డులో స్థలంలో లేక ఎక్కడ పోయాలో తెలియడం లేదు. మార్కెట్‌ను చల్‌గల్‌కు తరలిస్తారనే నేపథ్యంలో ఇటీవల ఎమ్మెల్యే సంజయ్ చొరవతో అక్కడ అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

మార్కెట్ యార్డుకు స్థల సమస్య..

జగిత్యాల మార్కెట్ యార్డుకు 5.34 ఎకరాల స్థలం ఉంది. ఏడాది క్రితం ఇందులో నుంచి 2 ఎకరాలను సమీకృత మార్కెట్ నిర్మాణానికి కేటాయించారు. అలాగే, 1.34 ఎకరం విస్తీర్ణంలో రెండు గోదాములు ఉన్నాయి. మార్కెట్‌యార్డుకు మిగిలిన 2.00 ఎకరాల్లో మార్కెట్‌యార్డును నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంట ఉత్పత్తులు విక్రయించేందుకు జగిత్యాల చుట్టూ పక్కల గ్రామాల ప్రజలే కాకుండా పలు మండలాల నుంచి రైతులు వస్తుంటారు. యార్డులో స్థలం లేక రైతులు తమ ఉత్పత్తులను రోడ్డుపైనే పోయడం, వాటిని తీసుకెళ్లేందుకు వచ్చిన లారీలు, ట్రాక్టర్లు తొక్కుతుండటంతో ఉత్పత్తుల నాణ్యత దెబ్బతిని, వ్యాపారులు రేటు తగ్గిస్తున్నారు.

పూర్తి స్థాయి మార్కెట్

జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో ఏడాదంతా మార్కెట్ యార్డులో క్రయ విక్రయాలు సాగుతుంటాయి. ఈ మార్కెట్‌లో వరి ధాన్యంతో పాటు అన్ని రకాల ఆహార ధాన్యాల ఉత్పత్తులను రైతులు తీసుకవస్తారు. జగిత్యాల మార్కెట్‌కు వచ్చే ఆదాయంలో దాదాపు రూ.40 లక్షల వరకు ఆహార ధాన్యాల ఉత్పత్తుల కొనుగోలు వల్లే వస్తుంది. ఈ మార్కెట్ యార్డుపై వ్యాపారస్తులు, హమాలీలు, చాట, సడెం కార్మికులు ఆధారపడి ఉన్నారు.

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

జగిత్యాల మార్కెట్‌యార్డును 3 కి.మీ దూరంలో ఉన్న చల్‌గల్ మార్కెట్‌యార్డుకు తరలించాలని ఆలోచనలు చేస్తున్నారు. ఇప్పటికే, మార్కెట్ కార్యాలయం, చైర్మన్ కార్యాలయాన్ని తరలించారు. చల్‌గల్‌లో ఇప్పుడిప్పుడే అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అక్కడ రైతులు, వ్యాపారస్తులకు కనీస సదుపాయాలు లేవు. దీనికి తోడు మార్కెట్ యార్డు చాలా దూరం ఉండటంతో అక్కడికి వెళ్లడానికి రైతులు, వ్యాపారస్తులు ఆసక్తి చూపడం లేదు. చల్‌గల్ మార్కెట్‌యార్డుకు తరలించాలని గత పాలకవర్గాలు ఆలోచన చేసినప్పటికీ అమలులోకి రాలేదు.

సరైన వసతులు కల్పించాలి



చల్‌గల్ మార్కెట్‌యార్డులో అన్ని వసతులు కల్పించిన తర్వాతనే మార్కెట్ యార్డును తరలిస్తే బాగుంటుంది. ఎమ్మెల్యే సంజయ్ చొరవతో ఇప్పుడిప్పుడే అభివృద్ధి పనులు జరుగుతుండటం అభినందనీయం. రైతులు, వ్యాపారస్తులకు కనీస సదుపాయాలు కల్పించాలి, పూర్తి స్థాయిలో పనులు పూర్తయిన తర్వాతనే తరలించాలి.

– చిక్కుల భూమయ్య,
అడ్తి, ఖరీదుదారుల సంఘం అధ్యక్షుడు, జగిత్యాల

చల్‌గల్ మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతా



చల్‌గల్ మార్కెట్‌యార్డులో అన్ని వసతులు కల్పించబోతున్నాం. కొత్త ప్రభుత్వంలో రూ 1.70 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతుండగా, ఇప్పటికే రూ. 8 కోట్లతో చల్‌గల్ మామిడి మార్కెట్‌లో షెడ్లు నిర్మించాం. మరిన్ని నిధులు తీసుకవచ్చి రాష్ట్రంలోనే ఓ మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతాం.

– డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే, జగిత్యాల

ముందస్తు ఉగాది వేడుకలు



జగిత్యాల: సాంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు



ధర్మపురి: రాజారం ప్రభుత్వ పాఠశాలలో వేడుకలు



కోరుట్లలో కవి సమ్మేళనంలో కవులకు సన్మానం

జగిత్యాల/కోరుట్లటౌన్/ధర్మపురి/మెట్‌పల్లి/రాయికల్/మల్యాల/పెగడపల్లి/సారంగాపూర్/మల్లాపూర్: జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యార్థులు, అధికారులు శనివారం ముందస్తుగా ఉగాది వేడుకలు నిర్వహించుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. ఉగాది పచ్చడి తయారుచేసి పంచిపెట్టారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొత్తదాంరాజుపల్లి ప్రభుత్వ పాఠశాలలో వేడుకలు



సారంగాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో..

క్రీడాకారులకు ప్రభుత్వ సహాయ సహకారాలు

ధర్మపురి: క్రీడా రంగాల్లో రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఉత్సాహం చూపుతున్న క్రీడాకారులకు ప్రభుత్వం తరుపున సహాయ సహకారాలు అందిస్తుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి పూజిత పవర్ లిఫ్టింగ్ 76 కిలోల విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో ఎంపికై ంది. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రీడాకారిణిని సన్మానించి అభినందించారు. ఇంకా ఉన్నత స్థానానికి ప్రభుత్వం తరుపున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.



పూజితను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్, నాయకులు

విప్ అడ్లూరి, ఎమ్మెల్సీని కలిసిన నాయకులు

మల్లాపూర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం ఇందిరా భవన్‌లో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌ను మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను గెలుచుకునేలా నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు.

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలను కలిసిన డిపో మేనేజర్

జగిత్యాల: జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కల్పన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌లను కలుసుకున్నారు. జగిత్యాల డిపోను ప్రగతి పథంలో తీసుకెళ్లాలని కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

మల్యాల: మండలంలోని బల్వంతాపూర్ శివారులో జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనదారుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం మధ్యాహ్నం పాత బెల్లంపల్లికి చెందిన గొడిసెల గంగరాజు జగిత్యాలవైపు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని సమీపంలోని పొదల్లో ఎగిరిపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది ఈఎంటీ జ్యోతి,పైలట్ శ్రీనివాస్ జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హామీలపై నిలదీస్తే విమర్శలా?

జగిత్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం హామీలపై నిలదీస్తే విమర్శలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకులు అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఇటీవల కవిత, కేసీఆర్ కుటుంబాలపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని, మొదట మీ గ్రామంలో నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. అనేక భూములు కబ్జా చేసి పేదల పొట్టకొడుతున్నారని ఆరోపించారు. ఇంకోసారి విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు దావ సురేశ్, హరీశ్, ప్రణయ్ పాల్గొన్నారు.

సమాజంలో అందరూ సమానులే

రాయికల్: సమాజంలో ప్రతీ ఒక్కరు సమానులేనని తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. రాయికల్ మండలం చెర్లకొండాపూర్‌లో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం పేరుతో ఎవరైనా దూషిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఆర్‌ఐ దేవదాసు, కార్యదర్శి నరేశ్, నాయకులు లక్ష్మీనారాయణ, సుదర్శన్ పాల్గొన్నారు.

దూలూర్‌లో సివిల్ రైట్స్ డే

కథలాపూర్: మండలంలోని దూలూర్‌లో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. అధికారులు ఎస్సీ కాలనీలో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల్లో అందరు భాగస్వాములు కావాలని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు మద్దెల నాగేశ్, మురళి, వైభవ్, మాజీ సర్పంచ్ దయ్య లక్ష్మీనర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.



దూలూర్‌లో మాట్లాడుతున్న అధికారులు

అన్ని వర్గాల ప్రజలు సమానంగా జీవించాలి

పెగడపల్లి: అన్ని వర్గాల ప్రజలు సమానంగా జీవించాలని అధికారులు అన్నారు. మండలంలోని నర్సింహునిపేటలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కులం పేరుతో దూషిస్తే చట్టరీత్యా శిక్షార్హులు అవుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, ఆర్‌ఐ జమున, పంచాయతీ కార్యదర్శి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తికి జరిమానా

మల్యాల: నాటుసారా విక్రయిసూత పట్టుబడిన వ్యక్తికి తహసీల్దార్ రూ.25వేలు జరిమానా విధించారు. మండలంలోని రాంపూర్ ఒడ్డెర కాలనీకి చెందిన జట్‌పెట్ రాజు గతంలో నాటుసారా విక్రయిస్తూ పట్టుబడగా, ఏడాది కాలానికి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా, మరోసారి రాజు నాటుసారా విక్రయిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని, శనివారం మల్యాల తహసీల్దార్ మునీందర్ ఎదుట హాజరుపర్చగా, రూ.25000 జరిమానా విధించగా, నిందితుడు జరిమానా చెల్లించి, రశీదును ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్‌కు అందజేశాడు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

సుతారి, గుత్తేదారు భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా రాజన్న

జగిత్యాలటౌన్: సుతారి, గుత్తేదారు భవన నిర్మాణ కార్మిక సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా మూలాసపు రాజన్న ఎన్నికయ్యారు. శనివారం సంఘం భవనంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా తూం భీమయ్య, బొక్కల నర్సయ్య, జిల్లాల పెద్దన్న, చిట్ల శ్రీనివాస్, జిల్లాల ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా భారతపు శ్రీనివాస్, దన్నపునేని చంద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బండారి మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా గోలి గంగారాం, సంయుక్త కార్యదర్శిగా గోలి రవి, కోశాధికారిగా దయ్యాల రాజేశంలను ఎన్నుకున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.

రామాలయం నూతన కార్యవర్గం ఎన్నిక

కథలాపూర్: మండలకేంద్రంలోని రామాలయం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇట్టెడి సంజీవ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా తిక్క గంగారెడ్డి, కోశాధికారిగా తిపిరెడ్డి శ్రీకాంత్, డైరెక్టర్లుగా గాండ్ల సాయి, కళ్యాణ్, పంబాల లక్ష్మణ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గసభ్యులను హనుమాన్ దీక్షాపరులు, గ్రామస్తులు సన్మానించారు.

క్లుప్తంగా

ఉద్యోగ విరమణ పొందిన వారికి పోలీసు శాఖ అండ



సన్మానిస్తున్న అదనపు ఎస్పీ భీమ్‌రావు

జగిత్యాలక్రైం: పోలీసు శాఖలో ఉద్యోగ విరమణ పొందిన వారికి పోలీసు శాఖ అండగా ఉంటుందని జిల్లా అదనపు ఎస్పీ భీమ్‌రావు అన్నారు. పదవీ విరమణ పొందిన ఎస్సై మన్సూర్‌ఖాన్, హెడ్‌కానిస్టేబుల్ గంగారాజంలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలు పొందడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వేణు పాల్గొన్నారు.

రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో ముద్రించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న రేషన్‌కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోను ముద్రించాలని బీజేపీ జిల్లా ప్రతినిధి మర్రిపల్లి సత్యం డిమాండ్ చేశారు. పెగడపల్లిలో శనివారం పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. ఆహార భద్రత చట్టం మేరకు నిరుపేదలకు ఉచితంగా కేంద్రం బియ్యం పంపిణీ చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తామే ఉచితంగా బియ్యం అందిస్తున్నామని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా రాష్ట్రంలో 3.50 కోట్ల మందికి నెలకు ఆరు కిలోల బియ్యం ఉచితంగా ఇస్తున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు పల్లె మోహన్‌రెడ్డి, నాయకులు షేర్ అంజన్న, పెంట నరేందర్, కాశెట్టి రాజు పాల్గొన్నారు.

ఆలయానికి వాటర్ ప్యూరిఫైర్ వితరణ

రాయికల్: పట్టణంలోని నాగారం ఆంజనేయ స్వామి దేవాలయానికి పట్టణానికి చెందిన మాచర్ల హరిదాసు కుమారుడు రాజశేఖర్ వాటర్ ప్యూరిఫైర్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో విక్రమ్, ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్ రాజశేఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రాయిల్ల ప్రభాకర్, గణేశ్, వొజ్జల రాజిరెడ్డి, కల్లెడ రాజు, మణిదీప్, జ్యోతి, రాజేందర్, అర్చకులు భరత్ శర్మ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గొల్లపల్లి: గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని వెనుగుమట్లలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 400 ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లకు వైద్యం పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమా సంతోష్, ఉపాధ్యక్షుడు పురపాటి రాజిరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ తిరుపతి, మార్కెట్ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని శేషప్ప కళావేదికపై నూతన పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేశారు. నేడు నిర్వహించనున్న ఉగాది పర్వదినంను పురస్కరించుకొని ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి శేషప్ప కళావేదికపై పంచాంగ శ్రవణకర్త బుగ్గారపు రాజేంద్రప్రసాద్‌చే నూతన పంచాంగ శ్రవణం గావిస్తారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 19 తులాల బంగారు నగలు అపహరణ

జగిత్యాల క్రైం: జిల్లాకేంద్రంలోని అరవింద్‌నగర్‌లో పురుమేల్ల ప్రియదర్శిని ఇంట్లో గుర్తు తెలియన దొంగలు చొరబడి 19 తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన ప్రియదర్శిని సారంగాపూర్ కస్తూరిబా బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ అరవింద్‌నగర్‌లో నివాసం ఉంటోంది. శుక్రవారం రాత్రి ఆమెకు కస్తూర్బాలో నైట్ డ్యూటీ ఉండడంతో ఇంటికి తాళాలు వేసి విధులకు వెళ్లారు. దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 19 తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం ఇంటి పక్కవారు చూసి ప్రియదర్శినికి సమాచారం అందించారు. తెల్లారి ఇంటికి చేరుకుని చోరీపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై గీత తెలిపారు.

రెండు గ్రామాల మధ్య సరిహద్దు వివాదం

- నడికుడ, మొగిలిపేటలో ఉద్రిక్తత

మల్లాపూర్: మల్లాపూర్ మండలం నడికుడ, మొగిలిపేట గ్రామాల మధ్య చాలారోజులుగా ఉన్న సరిహద్దు సమస్య శనివారం తారాస్థాయికి చేరింది. ఎస్సారెస్పీ ముంపు గ్రామమైన నడికుడకు సుమారు 1970లో మొగిలిపేట శివారులోని 747 సర్వే నంబర్‌లో 167 ఎకరాలు కేటాయించారు. అందులోనే మూడునాలుగెకరాలు వివాదాస్పదంగా మారింది. అప్పటి నుంచి రెండు గ్రామాల మధ్య వివాదం నడుస్తోంది. ఆ భూమిలో మొగిలిపేట గ్రామస్తులు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించుకున్నారు. దీంతో రెండు గ్రామాల పెద్ద మనుషులు, వీడీసీ సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో భూమి వద్ద చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. రహదారిని దిగ్బంధించడంతో ట్రాఫిక్‌జామ్ అయింది. అక్టోబర్ 30న ఇరుగ్రామాల మ ధ్య ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో సమస్యను పరిష్కరించాలని ఆర్డీవో, తహసీల్దార్‌కు విన్నవించామని, పరిష్కరించకపోవడంతోనే ఉద్రిక్తత చోటుచేసుకుందని తెలిపారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వీర్‌సింగ్, మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ అనిల్‌కుమార్, మల్లాపూర్, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్ ఎస్సైలు రాజు, కిరణ్‌కుమార్, శ్రీకాంత్, నవీన్‌కుమార్ ఘటనస్థలికి చేరుకుని ఇరు గ్రామాల పెద్దమనుషులతో మాట్లాడుతామని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సూచించారు. అడిషనల్ కలెక్టర్ బీఎస్.లతతో మాట్లాడించడంతో ఇరుగ్రామాల వారు ఆందోళన విరమించారు.

అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటా

జగిత్యాల: అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. కులవర్గాల బేధం లేకుండా అన్ని వర్గాల ప్రజలు కలిసి ఉంటున్నామంటే అది భారత రాజ్యాంగమన్నారు. ఇఫ్తార్ మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ఆర్డీవో మధుసూదన్, కమిషనర్ స్పందన, తహసీల్దార్ రాంమోహన్, గిరి నాగభూషణం పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే, ముస్లింలు

విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందన

జగిత్యాలరూరల్: మండలంలోని మోరపల్లికి చెందిన విద్యార్థిని పొట్టవత్తిని మనస్విని ఇటీవల నవోదయలో సీటు సాధించగా, శనివారం విద్యార్థినిని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమణరావు, కరస్పాండెంట్ వెంకటరమణరావు, మాజీ కౌన్సిలర్ కప్పల శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీవో

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో అంబేడ్కర్ సంఘం భవన అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, భూమేశ్వర్, రాజం, శంకర్, మండల నాయకులు కోల శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

జగిత్యాల: శ్రీరామనమి, ఉగాది, రంజాన్ సందర్భంగా పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలని, జిల్లాకేంద్రంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో సమావేశమయ్యారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. ప్రతి వార్డులో క్షేత్రస్థాయిలో పరిశీలించి క్లీన్‌అండ్ గ్రీన్‌గా ఉంచేలా చూడాలన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో ఉండే ప్రజలకు నీటి ఇబ్బందులు రానీయొద్దన్నారు. కార్యక్రమంలో కమిషనర్ స్పందన, టీపీవో శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే

రోగులకు ఇబ్బంది కలగకుండా సేవలు

కోరుట్ల: ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రి సమస్యలు, అవసరమైన సిబ్బంది, పరికరాల కోసం త్వరలో వైద్యఆరోగ్య శాఖ మంత్రిని కలుస్తానన్నారు. ఆసుపత్రి సమస్యలను ఇప్పటికే అసెంబ్లీలో ప్రస్తావించానని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, వైద్యులు,ఎంపీడీవో రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి సిబ్బందితో సమావేశమైన ఎమ్మెల్యే

వరి కోతల్లో అప్రమత్తంగా ఉండాలి

మల్యాల: వరికోత యంతాలతో కోతలు కోసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని మల్యాల మండల తహసీల్దార్ మునీందర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం వరికోత యంత్రాల డ్రైవర్లు, యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మునీందర్ మాట్లాడుతూ వరికోత పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతనే వరికోతలు ప్రారంభించాలని సూచించారు. వరికోతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పంట కోతకు అధిక ధర వసూలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఏవోఓ చంద్రదీపక్ మాట్లాడుతూ హర్వేస్టర్ ఆర్‌పీఎం 18 నుంచి 19 వరకు ఉండాలని, బ్లోయర్ ఖచ్చితంగా వినియోగంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, హర్వేస్టర్ డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ మునీందర్

ధాన్యం డబ్బులు రూ.6.78లక్షలు స్వాహా

- ట్యాబ్ ఆపరేటర్‌పై కేసు నమోదు

సారంగాపూర్: వానాకాలం సీజన్‌లో ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు చెల్లించకుండా ట్యాబ్ ఆపరేటర్ రూ.6,78,368 స్వాహా చేశాడు. రైతుల ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం.. సారంగాపూర్ మండలం పోతారం గ్రామంలో వానాకాలం సీజన్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. గ్రామానికి చెందిన వోడ్నాల భూమరాజును తాత్కాలిక ట్యాబ్ ఆపరేటర్‌గా నియమించారు. దీంతో ఆయన 11 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 292 క్వింటాళ్లకు సంబంధించిన ధాన్యం డబ్బులు రూ.6,78,368 తన బ్యాంకు ఖాతాకు జమచేసుకున్నాడు. నెలలు గడస్తున్నా.. ధాన్యం డబ్బులు జమ కాకపోవడంతో అనుమానం వచ్చిన రైతులు సారంగాపూర్ సహకార సంఘ కార్యాలయం ఎదుట పలుమార్లు ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారులు విచారణ జరపగా భూమరాజు సొంతానికి వాడుకున్నట్లు గుర్తించారు. సంఘం అధ్యక్షుడు ఏలేటి నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు భూమరాజంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు పెగ్గెర్లలో శ్రీలక్ష్మీ నృసింహస్వామి జాతర

కథలాపూర్: మండలం పెగ్గెర్లలో ఆదివారం శ్రీలక్ష్మీ నృసింహస్వామి జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. జాతర ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. భక్తులు అధిసంఖ్యలో తరలివచ్చి జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని గ్రామస్తులు కోరారు.